క్లుప్తంగా

12న 'డయల్ యువర్ డీఎం'

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపోలో ఈ నెల 12న ఉదయం 11 గంటలకు ×డయల్ యువర్ డీఎం៖ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు డీఎం సుధాకరయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను, సూచనలను సెల్ నంబర్: 9100941850కు తెలియజేయాలని కోరారు.

గర్భవతులకు వైద్య పరీక్షలు


రొంపిచెర్ల పీహెచ్‌సీలో గర్భవతులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రొంపిచెర్ల: గర్భవతులకు గుండె, ముఖ్యమైన ఇతర వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్లు దినేష్ కుమార్ నాయక్, వినయ్ అన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భవతులు, బాలింతలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి వారు మాట్లాడారు. గర్భవతులు వడదెబ్బ బారిన కుండా పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. నూలు వస్త్రాలు ధరించాలన్నారు. గర్భవతులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు చేసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రు పాలు తాగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే సంపూర్ణ పోషణను గర్భవతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీలు భారతి, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం: నిందితుడి అరెస్ట్


నిందితుని అరెస్టు చూపుతున్న పోలీసులు

సదుం: సారా తయారీకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ మారుతి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..మండలంలోని రెడ్డివారిపల్లె ప్రాజెక్టు సమీపంలో సారా కాస్తున్నట్టు సమాచారం అందడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. సారా తయారు చేస్తున్న భరత్‌ను అరెస్టు చేసి, నిందితుని వద్ద 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే 800 లీటర్ల ఊట, సారా తయారీకి ఉపయోగించిన సామగ్రిని ధ్వంసం చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఐరాల: క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని బంగారుపాళెం త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవాసమితి రూపొందించిన త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ను బుధవారం దివిటివారిపల్లెకు చెందిన నారాయణ నివాసంలో శ్రీ కృష్ణుడి ప్రతిమకు పూజలు చేసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు ధనుంజయ మాట్లాడుతూ ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థమయ్యే విధంగా రూపొందించామన్నారు. అనంతరం తెలుగు క్యాలెండర్లను, త్రైత సిద్ధాంత గ్రంథాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు నారాయణ, కుమారి, చలపతి, ఈశ్వర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అన్ని వసతులు


ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీచేస్తున్న రవిరాజు

గుడిపాల: రోగులకు అందుబాటులో అన్ని వసతులు కల్పించాలని డీఎంహెచ్‌ఓ రవిరాజు అన్నారు. బొమ్మసముద్రం, గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. మందుల కొరత ఉన్నట్లయితే వెంటనే తెలియజేయాలన్నారు. అట్టపెట్టలను బయట ప్రాంతంలో ఉంచాలని ఆస్పత్రి లోపల వేయకూడదన్నారు. ఎప్పటికప్పుడు ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందేవిధంగా చూడాలన్నారు. వైద్యాధికారులు సంధ్య, చంద్రమహేష్, అనూష ఆయనతో పాటు ఉన్నారు.

ఈరోజు

విద్యుత్ అంతరాయం

కుప్పం రూరల్: కుప్పం 11/33కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా వెండుగంపల్లె, పరసముద్రం ఫీడర్లలో గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు రెస్కో ఎండీ ప్రభాకర్ తెలిపారు. అలాగే, గుత్తార్లపల్లె సబ్ స్టేషన్ గుండ్లసాగరం ఫీడర్‌లో గురువారం అర్ధరాత్రి 12 నుంచి శుక్రవారం ఉదయం 7 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన చెప్పారు. వినియోగదారులు, రైతులు దీనికి సహకరించాలని కోరారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర

- జాతరకు పోటెత్తిన జనం
- నేడు జలధితో జాతర పరిసమాప్తం


అమ్మవారి శిరస్సు ఊరేగింపు


అమ్మవారి సేవలో ఎమ్మెల్యే వెంకటేగౌడ తదితరులు

పెద్దపంజాణి: ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా అప్పినపల్లెలో నిర్వహించే నడివీధి గంగమ్మ జాతర ఈ ఏడాది కూడా గ్రామస్తులు కలసికట్టుగా వైభవంగా నిర్వహించారు. విద్యుత్తు దీపాల నడుమ అమ్మవారు బుధవారం వేకువ జాము నుంచి భక్తుల దర్శనార్థం కొలువు దీరారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిప్రపత్తులతో శిరస్సు మెరవణి

అమ్మవారి శిరస్సు మెరవణి మంగళవారం అర్ధరాత్రి పుంగనూరు రోడ్డులోని గ్రామ సచివాలయం వద్ద ప్రారంభమైంది. మంగళ వాయిద్యాల నడుమ బజారు వీధి మీదుగా సాగి కోట వీధి వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని ఆశీనులు చేశారు. ఊరేగింపులో ప్రతి ఇంటి వద్ద అమ్మవారి శిరస్సుకు హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. మెరవణి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్దపంజాణి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మవారిని సేవలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీపీ రెడ్డెప్ప, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, సర్పంచులు ధనంజయ, చంద్రశేఖర్, పార్టీ నాయకులు రాజారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు నిమజ్జనం

రెండు రోజుల గంగమ్మ జాతర గురువారం ఉదయం నిమజ్జనంతో ముగియనుంది. అమ్మవారి విశ్వరూప దర్శనం అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా వేడుకలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ శివారులో నిమజ్జనం చేస్తారు.

12న మంత్రి పర్యటన విజయవంతం చేద్దాం


మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన నాయకులు

సదుం: మండలంలోని ఈనెల 12న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప పార్టీశ్రేణులను కోరారు. ప్రతి పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో మంత్రి పాల్గొంటారని, ఆయా గ్రామాలలో అధిక సంఖ్యలో గ్రామస్తులు హాజరయ్యేలా నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బూరగమందలో మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, సర్పంచ్ వెంకటరమణ, వెంకటరెడ్డి, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయనను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి తిరుపతిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. షెడ్యూల్‌ను ఆయనకు వివరించారు. పర్యటనపై మంత్రి వారికి పలు సూచనలు ఇచ్చారు.

ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు బహుమతులు


పుంగనూరులో ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్న డీఎం సుధాకరయ్య

పుంగనూరు: ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు బుధవారం డీఎం సుధాకరయ్య బహుమతులు అందజేశారు. పుంగనూరు ఆర్టీసీ డిపో సర్వీసులకు సంబంధించి పుంగనూరు, ముళబాగిల్, రాయచోటి, మేటిమంద, కలికిరి, రాయచోటి మార్గాల్లో ప్రయాణించిన వారి టికెట్లను గిఫ్ట్ బాక్సుల నుంచి సేకరించి లక్కీడిప్ తీశారు. ఇందులో ప్రయాణికులు అబ్దుల్‌ఖాదర్, ధనలక్ష్మి, యుగంధర్, నాగమ్మ, నఫెసనా, ఫయాజ్ హుస్సేన్, మీనాక్షి, గంగాధర్ ఎంపికయ్యారు. వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ సంధ్య, సిబ్బంది రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం


సదుం: ప్రచారం చేస్తున్న మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ

పులిచెర్ల(కల్లూరు): వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం బుధవారం ఆ పార్టీ నాయకులు మండలంలోని కమ్మపల్లె పంచాయతీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డికి ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధి గురించి వివరించారు. ప్రజలకు మరింత సంక్షేమ లబ్ధి చేకూరాలంటే మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరి, సర్పంచ్ నాగరాణి, నాయకులు రవీంద్రనాథరెడ్డి, నాగిరెడ్డి, కేశవరెడ్డి, గోవర్ధన్, నిరంజన్‌రెడ్డి, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మానాయనపల్లెలో..

సదుం: మండలంలోని తిమ్మానాయనపల్లెలో బుధవారం మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు అందజేస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఓటర్లకు వివరించారు. గత నలభై ఏళ్లలో జరగని నియోజకవర్గ అభివృద్ధి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో ఐదేళ్లలోనే ఎంతగానో చేశారని, మళ్లీ వారినే ఎన్నుకుంటే మరింత అభివృద్ధి చేస్తారని చెప్పారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి భారీ మెజార్టీ సాధించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లోకనాథంరెడ్డి, వైఎస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మంగమ్మ, మల్లికార్జున, నాయకులు వాసు, గణేష్‌రెడ్డి, ధనశేఖర్‌రెడ్డి, దుర్గారెడ్డి, సాకేత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.


పులిచెర్ల: కమ్మపల్లె పంచాయతీలో ప్రచారం చేస్తున్న నాయకులు

హనుమంతుడిపై శ్రీరాముని తేజసం



తిరుపతి కల్చరల్: శ్రీకోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం ఉదయం 8 గంటలకు స్వామి వారు హనుమంత వాహనంపై కొలువై తేజోవిలాసంతో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. గజరాజులు, వృషభాలు, అశ్వాలు ముందు నడుస్తుండగా, భజన బృందాల భక్తి సంకీర్తనల నడుమ కోలాటం, భజనలతో సాగుతుండగా స్వామివారి వాహన సేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులకు కర్పూర నీరాజనాలు పలికారు. వాహన సేవ అనంతరం ఉదయం 10.30 గంటలకు ఆలయ ఆవరణలో శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామ స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు. తర్వాత రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు స్వామివారి గజవాహన సేవ వేడుకగా నిర్వహించారు. గజవాహనాన్ని అధిరోహించిన రాములవారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఏడో రోజైన గురువారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహన సేవలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, కంకణభట్టర్ సీతారామాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా 'వరుస తొడుగు'


పట్టణంలో పూజాసామగ్రిని కొంటున్న మహిళలు


చికెన్ దుకాణాల వద్ద జనం

- గ్రామాల్లో జోరుగా పండుగ వ్యాపారం
- చికెన్, మటన్ దుకాణాల వద్ద క్యూ కట్టిన జనాలు
- 'సంక్షేమ' ఫలాలతో మెరుగు పడిన పేదల జీవన ప్రమాణాలు

పలమనేరు: నియోజకవర్గంలో ఉగాది పండుగ రెండోరోజైన బుధవారం వరుస తొడుగును ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వరుసకు మామ, బామ్మర్దులు, ఆడబిడ్డలకు పుట్టినింటివాళ్లు కొత్త బట్టలను పెట్టి విందుతో ఖుషీ ..ఖుషీగా గడిపారు. ఈసారి పల్లెల్లోనూ ప్రతి ఇంటా పండుగ వాతావరణం కనిపించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు ఠంఛనుగా చేరాయి. దీంతో దారిద్ర్యరేఖ దిగువన ఉన్న పలు కుటుంబాలు సైతం ఆర్థికంగా ముందుకెళ్లాయి. దీంతో వారు తమ స్తోమతకు తగ్గట్టు పండుగను జరుపుకున్నారు.

కిటికిటలాడిన దుకాణాలు

ఎన్నడూ లేనంతగా ఈ దఫా పలమనేరు పట్టణం, మండల కేంద్రాలైన వీ.కోట, బైరెడ్డిపల్లె, పెద్దపంజాణిలో పండుగ వ్యాపారాలు గతంలో కంటే మూడురెట్లు అధికంగా సాగినట్టు వ్యాపారవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా వస్త్ర దుకాణాలు, సరుకుల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడటం చూస్తే ప్రజల కొనుగోలు శక్తి బాగా పెరిగిందనేది తేటతెల్లమైంది.

మాంసం ధరలు పెరిగినా ఆగని కొనుగోళ్లు

పండగ సందర్భంగా చికెన్, మటన్ ధరలు కొండెక్కాయి. చికెన్ కిలో రూ.260, మటన్ రూ.900కు చేరుకుంది. నియోజకవర్గంలో ఏటా ఉగాదికి పది లోడ్ల చికెన్ వ్యాపారం జరిగితే ఈసారి 20లోడ్ల వ్యాపారం సాగిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

పేదల కష్టాలను తీర్చిన ప్రభుత్వ పథకాలు

నియోజకవర్గంలో 3లక్షల జనాభా ఉండగా ఇందులో 50 వేల కుటుంబాలు బీపీఎల్‌కు దిగువన ఉండేవి. అయితే ఈ ప్రభుత్వంలో నవరత్నాలతో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ సగటున రూ.50 వేల నుంచి అత్యధికంగా రూ.7లక్షల వరకూ పథకాల లబ్ధి అందాయి. ఫలితంగా పేదల జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు మెరుగు పడ్డాయి. కాబట్టే పండుగను పేదలు సైతం ఘనంగా జరుపుఎనేలా సంక్షేమ ఫలాలు ఉపయుక్తంగా మారాయి.

వీ.కోటలో..

వి.కోట: ఉగాది పండుగ మరుసటి రోజు ఆనవాయితీగా నిర్వహించే వరుస తొడుగు సంబరాలు మండలంలో బుధవారం అంబరాన్నంటాయి. ప్రజలు పరస్పరం రంగులు చల్లుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా రంగులు చల్లుకుని పండుగ వేడుకలు నిర్వహించారు.


రంగులు చల్లుకుని సంబరాలు చేసుకుంటున్న నాయకులు

మసీదులకు రంజాన్ శోభ

- ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గాలు
- పండుగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి


రంజాన్ ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గా


రాయలపేటలోని మసీదు

పెద్దపంజాణి: రంజాన్ పండుగకు మసీదులు ముస్తాబయ్యాయి. నెల రోజులుగా కఠోర ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు బుధవారం సాయంత్రం నెలవంక దర్శనంతో గురువారం ఈదుల్ ఫితర్ (రంజాన్) పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకునేందుకు సన్నద్ధులయ్యారు. రంజాన్ మాసంలో ఖురాన్ పఠిస్తే 70 రెట్లు పుణ్యం లభిస్తుందని అలాగే, ఖురాన్‌లోని ఐదు ధర్మాలను పాటిస్తూ దీక్షలు చేస్తే సత్ఫలితాలు కలుగుతాయని ముస్లింల విశ్వాసం. ఈ పండుగను పేద, ధనిక తేడా లేకుండా ముస్లింలు అందరూ జరుపుకోవాలని, ఉన్నవారు లేని వారికి ఫిత్రా రూపంలో దానం చేయాలని ఇస్లాం ప్రబోధిస్తుంది. ఈద్ నమాజ్‌కు వెళ్లే ముందు తప్పనిసరిగా ఫిత్రా దానం చేయాలి. అప్పుడే ఈద్ నమాజుకు దైవానుగ్రహం సిద్ధిస్తుందని నమ్మకం. అందుకే ఈ పండుగను ఈద్-ఉల్-ఫితర్ అని పిలుస్తారు. ఈద్ రోజున రెండు రకాల నమాజ్ తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. సూర్యోదయానికి ముందు నివాసం ఉన్న చోట ఉన్న మసీదులో విధిగా ఫజర్ నమాజు చేయాలి. ఇంటికి తిరిగి వచ్చి షీర్‌ఖుర్మా సేవించి ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేయాలి. దువా ముగిశాక ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటారు. దీంతో మనుషుల మధ్య ప్రేమలు, ఆప్యాయతలు పెరుగుతాయని, అసూయ, ద్వేషాలు సమసిపోతాయని భావిస్తారు.

పుంగనూరులో..

పుంగనూరు: రంజాన్ పండుగకు సంబంధించి గురువారం ఎస్ఎస్ పేటలోని ఈద్గా, తోపు మఠం ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేయనున్నారు. ఇందుకుగాను కమిషనర్ నరసింహప్రసాద్ పర్యవేక్షణలో మంచినీటి వసతి కల్పించారు; షామియానాలు వేశారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఉపవాస దీక్షల ఫలం పొందాలి

- మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ, మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటేగౌడ


మంత్రి పెద్దిరెడ్డి


ఎంపీ మిథున్‌రెడ్డి


ఎమ్మెల్యే వెంకటేగౌడ

పుంగనూరు/పలమనేరు: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర నియమాలతో చేసిన ఉపవాస దీక్షలకు అల్లా నుంచి ఫలాల ఫలితం పొందాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ వెంకట మిథున్‌రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆకాంక్షించారు. రంజాన్ పండుగ పురస్కరించుకుని బుధవారం ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లోని ముస్లింలు అందరూ గురువారం ఐకమత్యంతో, ఆనందోత్సాహాలతో రంజాన్ పండుగను జరుపుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంత శిశువుకు జన్మ


గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లె: గర్భవతులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారని వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. గర్భవతులు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యుల సలహాలు-సూచనలు పాటించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అనూరాధ, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్య సిబ్బంది, మహతి ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు వహించాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పులిచెర్ల(కల్లూరు): ప్రస్తుతం వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు వహించాలని కల్లూరు పీహెచ్‌సీ మెడికలాఫీసర్ డాక్టర్ జానకీరావు కోరారు. వడదెబ్బపై కల్లూరులో గురువారం ఆమె సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు బయట తిరగకుండా ఉండటమే మంచిదన్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో రావలసి వస్తే గొడుగు ధరించి లేదా టోపీ పెట్టుకుని వెళ్లాలని సూచించారు. అలాగే మజ్జిగ, నిమ్మరసం, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. వడదెబ్బ లక్షణాలతో నీరసించినట్లు అనిపిస్తే సమీపంలోని వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శారద ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

చించేది లేదు..చీల్చేదీ లేదు పోనా!

అమరం..అమరం
ఇది ఒక సమరం
ఇది చరిత్ర ఎరుగని ఘన సమరం
ఎటు ఉందో మన పయనం



అనే లెవెల్లో పలమనేర్ కాంగిరేసు ఇన్చార్జి పార్థసారథి రెడ్డెన్న, సైకిలు పారిటీ అమరన్న అందోళన రాగంలో ఓ సాంగేసుకున్నారంట! ఏందిరా సామీ ఈ కతంటే..రాష్ట్రాన్ని కాంగ్రెసోళ్లు రెండు ముక్కలు చేస్నారని ఒళ్లు మండిన ప్రజానీకం పోయినతూరి, అంతకుముందు ఎలచ్చన్‌లో తుకడాల్..తుకడాల్‌గా చెయ్యి గుర్తును కైమా చేసి సమాధి కట్టేసినారు. దీంతో ఈడ ఖేల్ కతం ..దుకాన్ బంద్ అయ్యింది గదా! కాంగిరేసు దుకానం తెరిచేవోల్లు లేక..యాపారం చేసేవాల్లూ రాక దివాలా తీసింది. ఇప్పుడు ఈతూరి ఎలచ్చన్‌లో అయినా దుకానం తెరిస్తే ఓట్ల యాపారం ఎట్లా ఉంటాదో? అని కాంగ్రెస్సోల్లు బాధ పడ్తాంటే బుదారం సైకిలెక్కి వలస పల్లికిబోయిన అమరన్న పార్థసారథన్నతో మాటలు కలిపినాడంట. చేతి గుర్తాయన శివశంకరన్నకు నువ్ నీ చెయ్ ఇచ్చినావంట కదనా? అని పార్థసారథన్న అడికే కాడికి భగవద్గీతలో కృష్ణ పరమాత్మలా అమరన్న నవ్వినాడంట..కాంగిరేసుకు పదివేల ఓట్లు కూడా రావని నేను షర్మిలక్క నేరుగాబోయి చెప్పొచ్చినా.. అయినా నువ్ ఆ శివునికే నువ్ చెయ్యిచ్చి గో ఎహెడ్ అన్నావంట గదనా? అని పార్థసారథన్న చిన్నబుచ్చుకుని అయన ముకాన్నే అడిగినాడంట..అంతలేద బ్బా..! అయిన కాడికి ఓట్లు చీల్చుదామని అని అమరన్న నసిగినాడంట! ఏందినా చీల్చేది.? అంజనేయసామి గుండెకాయలో రాములోరు ఉన్నట్టు ఈడ ఎవురి గుండెకాయల్ని చీల్చినా అందరి గుండెకాయల్లో జగను ఉండాదంట కదా!! ఇంక చీల్చేది లేదు..చించేదీ లేదు పోనా..! అని నిస్టూరమాడినాడంట! మంచి ఎండకొచ్చినావు ఈ టెంకాయ్ తాగేసిపో అని కొబ్బరిబోండాం ఇచ్చినాడంట! -పలమనేరు